పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ కృషి

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్యశ్రీ ద్వారా రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. ప్రస్తుతం విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆరోగ్య భద్రత కలిగించారన్నారు. అనంతరం వంగిపురం గ్రామానికి చెందిన పుష్పాల చైతన్యకు రూ.లక్ష చెక్కు, చౌడవరానికి చెందిన కొక్కిలిగడ్డ డింపుల్‌కు రూ.లక్ష చెక్కు, చింతపల్లిపాడుకు చెందిన మన్నవ రాజమ్మకు రూ.1.20 లక్షలు, కొమ్మూరుకు చెందిన సయ్యద్ దరియాసాహెబ్‌కు రూ.1.20 లక్షలు, గార్లపాడుకు చెందిన సీహెచ్ ద్రాక్షాయణి రూ.1.10 లక్షలు, అంకిరెడ్డిపాలేనికి చెందిన వై. రామకృష్ణారెడ్డికి లక్ష రూపాయలు, అప్పాపురానికి చెందిన పి.సుహాసినికు మారికి లక్ష రూపాయలు, కారంపూడిపాడుకు చెందిన పీ వీరయ్యకు రూ.లక్ష, తోకావారిపాలెం గ్రామానికి చెందిన దొడ్డా అగ్గియ్యకు రూ.లక్ష, జన్మభూమి నగర్‌కు చెందిన పసల ఆదిలక్ష్మికి రెండు లక్షలు, దాసరిపాలెంకు చెందిన జయజ్ఞానమ్మకు రెండు లక్షలు, రేటూరుకు చెందిన చుక్కా సురేష్‌కు రెండు లక్షలు, పెదపలకలూరుకు చెందిన షేక్ జాన్‌సైదాకు రెండు లక్షలు, పెద్దివారిపాలెంకు చెందిన సుధాకర్‌కు రెండు లక్షలు, గనికపూడికి చెందిన షేక్ రఫీకి రూ 24 వేలు, చల్లావారిపాలెంకు చెందిన ఎం.శివనాగేశ్వరరావుకు లక్షరూపాయలు, రేటూరుకు చెందిన పీ మల్లేశ్వరికి రెండు లక్షలు, కాకుమానుకు చెందిన నంబూరు పోలయ్యకు మూడు లక్షలు, తోకావారిపాలేనికి చెందిన ఎస్.పెదకోటయ్యకు లక్ష రూపాయలు, కొండేపాడుకు చెందిన దాసరి దేవదాస్‌కు రూ.లక్ష, జన్మభూమినగర్‌కు చెందిన మేకల శివలీలకు రూ.లక్ష , ఉప్పలపాడుకు చెందిన మదార్‌బాబుకు రూ.రెండు లక్షలు, నాగభైరవవారిపాలేనికి చెందిన రావి సాంబశివరావుకు రూ.లక్ష, ఓబులునాయుడుపాలేనికి చెందిన కె.దేవసహాయానికి రూ.లక్ష మొత్తం రూ.34,74,000 లక్షల విలువైన చెక్కుల ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మేకతోటి దయాసాగర్ దంపతులు కేక్‌ను కట్‌చేసి వేడుకలను నిర్వహించారు.

క్లుప్తంగా

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



ప్రత్తిపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. గ్రంథపాలకురాలు అరుణ ఆధ్వర్యంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. రకరకాల కథల పుస్తకాలు, నవల్స్, పోటీ పరీక్షల పుస్తకాలు వంటి వందలాది పుస్తకాలను ప్రదర్శించారు. శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులతో పుస్తకాల్లోని నీతి కథలను చదివించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ విజ్ఞానంతో కూడిన వినోదాన్ని అందిస్తూ వేసవి తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు.

నేత్ర సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ వివేకానంద రెడ్డి



ప్రత్తిపాడు: అత్యంత సున్నితమైన నేత్ర సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ ఎం.వివేకానంద రెడ్డి అన్నారు. నరసరావుపేట ఎంవీ రెడ్డి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన శిబిరానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. ప్రత్తిపాడుతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి 180 మంది రోగులు శిబిరానికి హాజరయ్యారు. వీరికి ఆస్పత్రి ఎండీ డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి నేత్ర పరీక్షలు చేశారు. స్వల్ప సమస్యలున్న వారికి ఉచితంగా మాత్రలు అందించారు. తీవ్రమైన సమస్యలున్న 101 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం రెఫర్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పేరేచర్లకు చెందిన సీహెచ్ శ్రీనివాసులు అతడి భార్య సారమ్మ తమ్ముడి కూతురు ప్రసవించడంతో పాపను చూసేందుకు శనివారం ఉదయం ద్విచక్రవాహనంపై పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు బయల్దేరారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం యనమదల సమీపంలో పదహారవ నంబరు జాతీయ రహదారిపై నిలిపి ఉన్న గడ్డి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అంబులెన్స్‌లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రీనివాసులు మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుమారుడు సంపూర్ణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్‌ఐ డి.రవీంద్రబాబు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. హైవేపై నిలిపిన ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న లైబ్రరి వద్ద ఆదివారం గుర్తు తెలియని సుమారు 45 సంవత్సరాల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫోటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 86888 31336 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కళ్లం ఫౌండేషన్ క్రికెట్ టోర్నీ విజేత సీతా సీసీ జట్టు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక జూనియర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో కళ్లం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 36 రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్త విజయ్‌కుమార్ రెడ్డి, కళ్లం టెక్స్‌టైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అడిషనల్ కమిషనర్, స్టేట్ టాక్స్ కృష్ణమోహన్‌రెడ్డి హాజరై బహుమతులు అందజేశారు. నిర్వాహకులు గోవిందరెడ్డి మాట్లాడుతూ ఈ క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా, ఉల్లాసంగా జరిగిందని, మొత్తం 64 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో సీతా సీసీ జట్టు, నాయక్ సీసీ జట్టుల మధ్య జరిగిన పోటీలో సీతా సీసీ జట్టు విజేతగా నిలిచిందని చెప్పారు. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నాయక్ సీసీ జట్టు 78 పరుగులకు ఆలౌట్ కాగా, అనంతరం బ్యాటింగ్‌లోకి దిగిన సీతా సీసీ జట్టు వికెట్ నష్టానికి 80 పరుగులు చేసి విజేతగా నిలిచిందని వివరించారు. విజయం సాధించిన సీతా సీసీ జట్టుకు ట్రోఫీని, లక్ష రూపాయల ప్రైజ్ మనీని అందజేశారు. రన్నర్స్ నాయక్ సీసీ జట్టుకు రూ.50 వేలు, 3వ స్థానంలో నిలిచి జట్టుకు రూ.30 వేలు, 4వ స్థానంలో నిలిచిన ఐశ్వర్య 786 జట్టుకు రూ.20 వేలు ప్రైజ్‌మనీగా అందజేశారు. గ్రామాల్లో ఉన్న యువకుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు చాలా దోహదపడతాయని భావిస్తున్నామని అన్నారు.

వర్ధమాన రచయితలకు ప్రోత్సాహం అభినందనీయం



'మన ఆంధ్రప్రదేశ్' కవితా సంకలనం ఆవిష్కరణలో పాపినేని శివశంకర్, పలువురు రచయితలు

నగరంపాలెం: సుదీర్ఘ కాలంగా వర్ధమాన రచయితల్ని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రోత్సాహించడం అభినందనీయమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. సంఘం చేపట్టిన అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్రలో భాగంగా ఆదివారం బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలోని అన్నమయ్య గ్రంథాలయాన్ని రచయితలు సందర్శించారు. తొలుత తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నమయ్య గ్రంథాలయ ప్రాశస్త్యాన్ని సంఘ రచయితులు అడిగి తెలుసుకున్నారు. తాళపత్ర వంటి విలువైన గ్రంథాల్ని పరిశీలించారు. అనంతరం ధార్మిక విజ్ఞాన ప్రాంగణంలో 'మన ఆంధ్రప్రదేశ్' కవితా సంకలనాన్ని, విత్తనం హైకూ సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సామాజిక అంశాలపై ప్రాంతాలకు అతీతంగా సాహితీ సేద్యం చేస్తున్న సంఘం సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. రచయితలు కన్నతల్లి, పుట్టిన నేల రుణాలు తీర్చుకునేలా స్వాభిమానానికి నష్టం వాటిల్లకుండా రచనలు చేయాలని ఆయన సూచించారు. సామాజిక స్పృహతో సత్యాన్ని, యథార్థాలకు ప్రాధాన్యత కల్పిస్తూ, సమ్మిళిత దృక్పథంతో రాయాలని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గ్రంథాలయ భాండాగారాల్లో సాహిత్య సౌరాభాల తోటలు విరబూస్తాయని తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి అన్నమయ్య గ్రంథాలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. అన్నమయ్య గ్రంథాలయ రూపశిల్పి లంకా సూర్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు చలపాక ప్రకాష్, ఎస్.ఎం.సుభాని, ప్రకాశం జిల్లా, పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, జయప్రకాష్, జనని సంస్థ (చెన్నై) ప్రధాన కార్య దర్శి గుడిమెట్ల చెన్నయ్య, సాహితీవేత్త లలితానంద్, డాక్టర్ ఉప్పలదడియం వెంకటేశ్వర్లు, పలువురు సాహితీవేత్తలు, రచయితలు పాల్గొన్నారు.

యూబీఐ కస్టమర్ ఔట్ రీచ్ ప్రచారానికి స్పందన



ప్రచారం నిర్వహిస్తున్న యూబీఐ అధికారులు

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) మార్కెట్ వాటాను వేగవంతం చేయడానికి, బ్రాండ్ ఇమేజ్‌ని పెంచుకోవడానికి 'ప్రాజెక్టు పవర్'ను ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు భారతదేశంలోని 126 జిల్లాలలో ప్రారంభించబడింది. ఇందులో గుంటూరు జిల్లా ఒకటి కావడం విశేషం. అందులో భాగంగా ఆదివారం గుజ్జనగుండ్లలోని వాకర్స్ అసోసియేషన్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ ఓట్ రీచ్ ప్రచారం నిర్వహించారు.

ప్రచార ర్యాలీలో బ్యాంక్ నూతనంగా ప్రారంభించిన ఉత్పత్తులైన అబ్ నారీకి బారీ, ఎంఎస్ఎంఈ, మహిళా పారిశ్రామికవేత్తలకు ఫైనాన్సింగ్ కోసం 'కృషి కే నాథ్ మహిళ' వంటి పథకాల్ని ప్రదర్శించారు. వీటి ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల మంది మహిళా కస్టమర్లకు సేవలు అందించాలని బ్యాంక్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకాలతో పాటు ప్రీమియం ఉత్పత్తులైన అధిక నెట్‌వర్త్ వ్యక్తుల కోసం సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలు, ప్రీమియం వినియోగదారుల కోసం ఎస్‌బీ పథకం, క్లాసిక్ కరెంట్ ఖాతా, బంగారు ఆభరణాలపై రుణాలు, విద్యా రుణాలను ప్రదర్శించి వివరించారు. ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌కు స్థానిక ప్రజలు, ఖాతాదారులు, వాకర్స్ నుంచి విశేష స్పందన లభించింది. యూబీఐ ప్రాంతీయ కార్యాలయం అధికారులు, సిబ్బందితో పాటు పట్టాభిపురం, జేకేసీ కాలేజీ, బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్‌ల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి



వెస్ట్ ప్యారిస్ చర్చిలో బాలస్వామిని సన్మానిస్తున్న ఫాదర్లు, సభ్యులు

నెహ్రూనగర్: రాష్ట్రంలో క్రైస్తవుల సమస్యల్ని సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని క్రిస్టియన్ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మద్దు బాలస్వామి తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ క్రిస్టియన్ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ మద్దు బాలస్వామి నియామకంపై పలువురు క్రైస్తవ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నార్త్ ప్యారిస్ చర్చి, వెస్ట్ ప్యారిస్ట్ చర్చిలో చర్చి పెద్దలు, సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు, చర్చి ఆస్తుల పరిరక్షణకు, శ్మశానాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నార్త్ ప్యారిస్ చర్చి రెవరెండ్ పాస్టర్ బాబూరావు, వెస్ట్ ప్యారిస్ చర్చి రెవరెండ్ పాస్టర్ సతీష్, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు, క్రిస్టియన్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిమళ్ల విజయ్, లూథరన్ సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ఉజ్వల భవిష్యత్



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని క్యాంపస్‌లో టెన్త్ స్టేట్, ఐసీఎస్ఈ సిలబస్‌లలో 550కి పైగా మార్కులు, సీబీఎస్ఈ సిలబస్‌లో 450కి పైగా మార్కుల్ని సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. మోహన్ మాట్లాడుతూ భావి జీవితానికి తొలిమెట్టు వంటి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థుల్ని ప్రోత్సహించడం మాస్టర్‌మైండ్స్‌కు ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మోటివేషన్ కల్పించారు. అనంతరం 535 మంది విద్యార్థిని, విద్యార్థులకు జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, మాస్టర్‌మైండ్స్ క్యాంపస్ ఇన్‌చార్జులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

గొడవర్రు(చేబ్రోలు): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో మహిళ గాయపడిన ఘటన చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన డి.లక్ష్మి ద్విచక్ర వాహనంపై గుండవరం వైపు వస్తుండగా స్థానిక కాలనీ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మి కాలు విరిగింది. తీవ్ర గాయాలైన బాధితురాలిని 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఆలయ భూముల కౌలు హక్కుల వేలం

పెదకాకాని: ఆలయ భూములు సాగు చేసుకునేందుకు కౌలుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఐదు ఎకరాలు మాగాణి భూమి చేబ్రోలు మండలం, శేకూరు శివారు వీరనాయకునిపాలెంలో ఉందన్నారు. అలానే దేవరాయబొట్లవారిపాలెంలో అర ఎకరం మాగాణి భూమి ఉందన్నారు. 2023–24 సంవత్సరానికి గాను కౌలుకు సాగు చేసుకునేందు కు రాష్ట్ర దేవదాయ ధర్మాదాయశాఖ అధికారు ల పర్యవేక్షణలో పెదకాకాని శివాలయంలో సోమవారం ఉదయం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. అలానే దేవరాయబొట్లవారిపాలెంలో ఉన్న అర ఎకరం మాగాణి భూమికి సోమవారం సాయంత్రం 4 గంటల కు నంబూరు వేణుగోపాలస్వామి ఆలయం వ ద్ద నిబంధల మేరకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఏసీ ఎస్.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఎన్టీఆర్ చిరస్మరణీయుడు

పెదకాకాని: తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే ఏకైక ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు అన్నారు. పెదకాకాని ప్రధానసెంటర్‌లో ఆదివారం రాత్రి మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగసభకు పార్టీ మండల అధ్యక్షుడు వలివేటి మురళి అధ్యక్షత వహించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టి రామారావు 100 వ జయంతి వేడుకలు జరుపుకునే తరుణంగా రాష్ట్రంలో ఎన్టీఆర్ విగ్రహాలు ఆవిష్కరణ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకుమార్, మాజీ ఎమ్మెల్సీలు పర్చూరి అశోక్‌బాబు, నన్నపనేని రాజకుమారి, సిటీ ప్రెసిడెంట్ డేగల ప్రభాకర్, దాసరి రాజా పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో ఎయిమ్స్ పీజీ ర్యాంకర్‌కు సత్కారం



గుంటూరు ఎడ్యుకేషన్: ఎయిమ్స్ పీజీ ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన డాక్టర్ వీవీ అనిరుధ్‌ను ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) ఆధ్వర్యంలో సత్కరించారు. అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో ఆదివారం జరిగిన పెన్షన్ల పంపిణీలో డాక్టర్ అనిరుధ్‌ను అవోపా రాష్ట్ర అధ్యక్షుడు టి. రాంబాబు, ప్రధాన కార్యదర్శి వి. నాగేశ్వరరావు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం 100 మంది పేదలకు ప్రతి నెలా జరిగే కార్యక్రమంలో భాగంగా పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా గుంటూరు అధ్యక్షుడు కె.వి. బ్రహ్మం, కార్యదర్శి వి. రాధాకృష్ణయ్య, కొత్తూరు సుధాకర్ పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారం గొలుసు చోరీ

మంగళగిరి: తన భర్తతో కలసి ద్విచక్ర వాహనంపై బంధువుల శుభ కార్యానికి హాజరై తిరిగి వస్తున్న క్రమంలో బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని దుండగులు బంగారు నానుతాడు, నల్లపూసల గొలుసును తెంచుకుని పారిపోయిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఆదివారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లికి చెందిన కొమ్మిశెట్టి వెంకటేశ్వరమ్మ తన భర్త సుబ్బారావుతో కలసి శనివారం రాత్రి ఆటోనగర్‌లో ఫంక్షన్‌కు బైక్‌పై వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యలోని తెనాలి ఫ్లై ఓవర్ దాటిన తరువాత వెనుకనే ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు వెంకటేశ్వరమ్మ మెడలోని గొలుసు తెంచుకుని పారిపోయారు. అయితే ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న సుబ్బారావు, వెనుకనే కూర్చొన్న భార్య వెంకటేశ్వరమ్మ రోడ్డుపై పడిపోయారు. ఇరువురూ బిగ్గరగా కేకలు వేసినా అప్పటికే గుర్తు తెలియని దుండగులు ద్విచక్ర వాహనంపై పారిపోయారు. దీంతో బాధితురాలు వెంకటేశ్వరమ్మ ఆదివారం మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ అంకమ్మరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ నివారణతో పర్యావరణ పరిరక్షణ



ఉప్పలపాడులో మాట్లాడుతున్న నారాయణ

పెదకాకాని: ప్రతి ఒక్కరూ నిషేధిత ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించడం ద్వారానే పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం సాధ్యపడుతుందని మిషన్ లైఫ్ సేవన్ థీమ్స్ గుంటూరు జిల్లా రీజినల్ అధికారి ఎం.నారాయణ అన్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడులో ఆదివారం ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. మిషన్ లైఫ్ సేవన్ థీమ్స్ పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గుంటూరు జిల్లా రీజినల్ అధికారి ఎం.నారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిషేధిత ప్లాస్టిక్ వాడకూడదని, ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుందన్నారు.

పర్యావరణం దెబ్బతింటుంది అంటే మన ఆరోగ్యం దెబ్బతింటుందని ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. ప్లాస్టిక్‌ను ఉపయోగించడం ద్వారా ఎక్కడ పడితే అక్కడ రోడ్ల వెంట ఇంటి పరిసర ప్రాంతాలు, చెరువులు, కాలువల్లోనూ ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయని తద్వారా జంతువులు, పక్షులు, ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్ ను నిషేధించి వాటి స్థానంలో జూట్ బ్యాగులను వాడటం ద్వారా పర్యావరణానికి మంచి జరుగుతుందని అన్నారు. పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా ప్రజలందరికీ అవగాహన కలిగించేందుకు ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో పర్యాటకులు వదిలేసిన ప్లాస్టిక్ క్యారీబ్యాగ్ సేకరించి రీసైక్లింగ్ యూనిట్లకు ఈ వ్యర్థాలను తరలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు, ఎనలిస్ట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహనతోనే అడ్డుకట్ట

డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ సుబ్బారావు తదితరులు

గుంటూరు మెడికల్: హెచ్ఐవీపై అవగాహనతోనే అడ్డుకట్ట సాధ్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. హెచ్ఐవీ వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం ద్వారా దాని బారిన పడకుండా ప్రజల్ని కాపాడవచ్చని చెప్పారు. అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆదివారం హెచ్ఐవీతో మరణించిన వారి జ్ఞాపకార్థం గుంటూరు లాడ్జి సెంటర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. హెచ్ఐవీతో ఎవరూ పుట్టరని, ఒకవేళ సోకినా అధైర్యపడకుండా మందులు వాడటం ద్వారా జీవితకాలం పెంచుకోవచ్చని తెలిపారు. హెచ్ఐవీకి ప్రభుత్వం ఉచితంగా మందులు, చికిత్స అందిస్తోందని చెప్పారు. బాధితులు మందులు వాడటం ద్వారా సాధారణ జీవితం గడపవచ్చని సూచించారు. బాధితులకు మనోధైర్యం కల్పిస్తూ భరోసా ఇస్తూ వైద్యసేవలందిస్తున్న ఉద్యోగులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. లాడ్జి సెంటర్‌లో ప్రారంభమైన కొవ్వొత్తుల ర్యాలీ అరండల్‌పేట మీదుగా ఏసీ కళాశాల వరకు కొనసాగింది. ర్యాలీలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ బండారు సుబ్బారావు, డాక్టర్ లక్ష్మానాయక్, జ్యోతుల వీరాస్వామి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



అన్నవరపు నాగమల్లేశ్వరరావును సన్మానిస్తున్న మాణిక్యవరప్రసాద్

నెహ్రూనగర్: జాతీయ స్థాయిలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ సూచించారు. నేషనల్ దోబీ మహా సాంగ్ జాతీయ అధ్యక్షుడిగా అన్నవరపు నాగమల్లేశ్వరరావు నియమితులైన సందర్భంగా ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ రజకుల సమస్యలపై జాతీయ స్థాయిలో గళం వినిపించి వాటి పరిష్కారానికి తగిన చొరవ తీసుకోవాలని సూచించారు. జాతీయ అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 14న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన నేషనల్ దోబీ మహాసాంగ్ 20 రాష్ట్రాల ప్రతినిధుల సమక్షంలో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికవ్వడం ద్వారా మరింత బాధ్యత పెరిగిందన్నారు. జాతీయ స్థాయిలో రజకుల ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో పావులూరి హనుమంతురావు, ఇంటూరి బాబ్జీ నంద, నాయకులు పాల్గొన్నారు.

27న రక్షిత తాగునీటి పథకం ప్రారంభం

పెదకాకాని: రక్షిత తాగునీటి పథకం ద్వారా ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాలకు తాగునీరు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య తెలిపారు. ఈనెల 27వ తేదీన ఉప్పలపాడు గ్రామంలో నిర్మించిన పథకాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామా ల ప్రజలు ళ్ల తరబడి తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో త్వరలో రెండు గ్రామాలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పలువురు పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. ఆయన వెంట ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, సొసైటీ చైర్‌పర్సన్ శివాబత్తుని దయానంద్, సభ్యులు పల్లెంపాటి శ్రీనివాసరావు, చెన్నుపాటి కళ్యాణి, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, ముద్రబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయంలో గుడి-బడి సేవలు



ఆలయాన్ని శుభ్రపరుస్తున్న గుడి-బడి సభ్యులు

పట్నంబజారు: పాత గుంటూరులోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి దేవస్థానంలో ప్రణవ పీఠం సభ్యులు ఆదివారం సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రణవ పీఠం సభ్యులు పలువురు మాట్లాడుతూ ఆలయాల పరిరక్షణలో భాగంగా ప్రతి ఆదివారం ఒక ఆలయాన్ని ఎంచుకుని శుభ్రపరుస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి దాకా గుంటూరు, కృష్ణా జిల్లాల్లో కలిపి 200 ఆలయాలకు పైగా శుభ్రపరిచినట్లు తెలిపారు. సనాతన హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు ఆలయాల్ని శుభ్రం చేసే మహోన్నత కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఆలయాన్ని శుభ్రం చేయించాలనుకునేవారు 9966222934, 9010209190 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో గుడిబడి సభ్యులు వంశీ, ప్రసాద్, భాగ్యశ్రీ , ఓంకార్, సుదీర్, మురళీప్రసాద్, రాఘవరావుతోపాటు 50 మంది సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్టు

ప్రత్తిపాడు: గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు సెబ్ ఎస్ఐ గీత తెలిపారు. ప్రత్తిపాడు మండలం యనమదలలో కొందరు యువకులు గంజాయి తాగుతున్నట్లు సమాచారం సెబ్ డీఎస్ఈఓ టీంకు అందింది. దీంతో శనివారం రాత్రి సుమారు పది గంటల సమయంలో స్పెషల్ టీం యనమదలలో దాడి చేసి గంజాయి తాగుతున్న యువకులను అదుపులోనికి తీసుకుని, వారిని ప్రత్తిపాడు సెబ్ స్టేషనుకు తరలించారు. వీరిలో యనమదల గ్రామానికి చెందిన శివరాత్రి యోగేంద్ర, బైనబోయిన రాజేష్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి డ్రై గంజాయి 80 గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.